క్లుప్తంగా

నాట్కో ట్రస్టు సేవలు భేష్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు సేవలు బాగున్నాయని జింఖానా బోర్డ్ ఆఫ్ ట్రస్టీ డాక్టర్ యలవర్తి రామరాజు భూషణుడు, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ సులోచన దంపతులు ప్రశంసించారు. సోమవారం నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను వారు సందర్శించారు.రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాల్ని పరిశీలించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌లను గుర్తించే వ్యాధి నిర్ధారణ పరికరాలతో పాటు శస్త్ర చికిత్సలకు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ను సైతం నాట్కో ట్రస్టు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. రేడియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ జి.దుర్గాప్రసాద్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవల గురించి వారికి వివరించారు.

త్యాగయ్య కీర్తనలు అజరామరం



పాత గుంటూరు: శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలు అజరామరమని వాగ్గేయకారుడు మాడభూషి వేదాంత నరసింహాచార్యులు పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య, పద్మావతి కళా వేదికలపై శ్రీ సరస్వతీ సంగీత విద్వత్ సభ ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి 175వ ఆరాధనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదాంత నరసింహచార్యుల శిష్య బృందం 12 గంటల పాటు లఘు అఖండం పేరుతో శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలు ఆలపించి భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. మారెళ్ల వామన్ కుమార్, డాక్టర్ ఎస్. పావని, సీత, సువర్ణ విద్య, అనూరాధ, గీతారామ్మోహన్, స్నిగ్ధ, నిరుక్త, సుముఖి, ఐశ్వర్య గాత్రంతో అలరించారు. వయోలిన్‌పై పాలేటి గోవర్ధన్, చావలి శ్రీనివాస్, పెరవలి నందకుమార్, మృదంగంపై కె.జగన్మోహిని, బి. సురేష్‌బాబు, ఘటంపై ఎం.హరిబాబు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో ఓగిరాల రామకృష్ణ, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, డాక్టర్ టి. కిరణ్ పాల్గొన్నారు.

దంత వైద్యంలో డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్



గుంటూరు మెడికల్: నగరంలోని శ్రీ దుర్గా స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ అధినేత, దంత వైద్యుల సంఘం సెక్రటరీ డాక్టర్ తాళ్ల హర్షవర్ధన్‌రెడ్డి స్విజ్జర్లాండ్‌లో జనవరి 13, 14 తేదీల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిమ్ అకాడమీ నుంచి కార్టికల్ ఇంప్లాంట్‌లో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. మాస్టర్ ఆఫ్ ఇమ్మెడిటేట్ లోడింగ్ డెంటల్ ఇంప్లాంటాలజీ కోర్సులో పీజీ వైద్యవిద్యను పూర్తి చేయడం ద్వారా తనకు గౌరవ డాక్టరేట్ లభించినట్లు ఆయన పేర్కొన్నారు.

డీ ఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డీ ఫార్మసీ డిప్లొమా కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లకు ఫిబ్రవరి రెండో తేదీన స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటోస్టాట్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందే విద్యార్థినులు ఎటువంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ ఉండవని పేర్కొన్నారు. దరఖాస్తులను మంగళవారం నుంచి కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి పొందగలరని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్ : నగరంలోని 29, 30 డివిజన్లకు చెందిన శ్మశానవాటికలో రూ. రూ. 35లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరలోనే వాటికను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

నగరంపాలెం: ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. 21వ డివిజన్ 76వ సచివాలయ పరిధిలోని కృష్ణబాబుకాలనీ మూడో వీధి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డివిజన్ కార్పొరేటర్ కాంద్రుకుంట గురవయ్య అధ్యక్షత వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మూడున్నరేళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను వారికి అందించారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉన్నట్లైతే తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్లల్లోని ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నారని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా, అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు మంజూరు కాకపోతే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. సకల జన సంక్షేమం పేరుతో వ్యక్తిగతంగా వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు లబ్ధి చేకూర్చాలనే ఆలోచనన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిలో కనిపిస్తోందని తెలిపారు. గత టీడీపీ హయాంలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల సమస్యల్ని తెలుసుకున్నారని చెప్పారు. ప్రతి సమస్యను కూలంకషంగా పరిశీలించి అనంతరం ప్రజలకు అనుకూలమైన పథకాల్ని రూపొందించి ఎన్నికల మేనిఫెస్టో రూపొందించారని వివరించారు. దీంతో ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్ని 95 శాతం ఇప్పటికే నెరవేర్చారని చెప్పారు. ప్రజలకు ఇంకా అవసరమైన మౌలిక సౌకర్యాలు తెలుసుకుంటూ, దానికి అనుగుణంగా అనేక సంక్షేమ పథకాల్ని వారికి అందిస్తున్నారని పేర్కొన్నారు. కడుపులోని బిడ్డ సంక్షేమం నుంచి పండు ముసలి వరకు అనేక సంక్షేమ పథకాలను అందించి, ప్రజాభిమానం చూరగొంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొండారెడ్డి నాగేశ్వరరెడ్డి, నాయకులు కె.రవీంద్రనాయక్, విజయ్, కాటం పవన్, గౌస్‌బాబు, బంగారప్ప విజయ్‌కుమార్, గంపా శ్రీనుబాబు పాల్గొన్నారు.

డాక్టర్ కాసరనేనికి ఘన నివాళి



కాసరనేని చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ గోపాలకృష్ణ, శంకరరావు, చంద్రలత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: దశాబ్దాల పాటు భార్య డాక్టర్ జయప్రదాంబ సహకారంతో వైద్యుడిగా, రాజకీయ నాయకుడిగా, విద్య, సామాజిక, సాహిత్య రంగాలకు విశేష సేవలందించిన డాక్టర్ కాసరనేని సదాశివరావు తనతోపాటు వర్తమాన, భవిష్యత్ తరాల వైద్యులకు, యువతకు ఆదర్శప్రాయునిగా నిలిచారని డాక్టర్ కాసరనేని జయప్రదాంబ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ పేర్కొన్నారు. డాక్టర్ కాసరనేని సదాశివరావు శతజయంతి వేడుకల్ని సోమవారం సదాశివనగర్‌లోని జయప్రదాంబ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ప్రముఖులు పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ వైద్యునిగానే కాకుండా కళా, సేవా రంగాలకు విశేషంగా సహకారాన్ని అందించిన సదాశివరావు గొప్ప మానవతామూర్తి అని కొనియాడారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ పి.చంద్రలత మాట్లాడుతూ వైద్య రంగంలో వేలాదిమందికి స్ఫూర్తిదాయకంగా నిలచిన గొప్ప మానవతా మూర్తులు డాక్టర్ జయప్రదాంబ సదాశివరావు దంపతులని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణను కళాశాల పాలకమండలి సభ్యులు, డాక్టర్ సదాశివరావు, జయప్రదాంబ కుటుంబ సభ్యులు, విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి.వి.శంకరరావు, కోశాధికారి డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, డాక్టర్ విష్ణుప్రియారావు, డాక్టర్ ఉషాబాల, డాక్టర్ కృష్ణవర్ధన్, ప్రిన్సిపాల్ మన్నవ రాజేశ్వరి పాల్గొన్నారు

బాల మేధావుల జాబితాలో తనీష్‌కి చోటు



తనీష్‌ను అభినందిస్తున్న శివాజీ, విష్ణువర్ధన్, వరప్రసాదరావు, పద్మజ, కృష్ణవేణి, పార్వతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లోకి ఎక్కిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూలు ఒకటో తరగతి విద్యార్థి కందుల తనీష్ మరో అరుదైన ఘనత సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ చెప్పారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ వ్యవధిలో ప్రపంచంలోని 65 దేశాల పేర్లు చెప్పడం ద్వారా గతేడాది అక్టోబర్‌లో ఆయా రికార్డ్స్ సాధించిన తమ విద్యార్థి తనీష్ తాజాగా దుబాయ్‌కు చెందిన ద చైల్డ్ ప్రాడజీ ప్రకటించిన ప్రపంచవ్యాప్త తొలి వంద మంది బాల మేధావుల జాబితాలో చోటు దక్కించుకున్నాడని తెలిపారు. మన దేశంలో ఈ ఘనత సాధించిన 26 మందిలో ఒకడు కాగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏకైక విద్యార్థి అని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి తనీష్‌ను పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ కో–ఆర్డినేటర్ కర్లపూడి పార్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- హిందూ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం



నవరత్నాల వీల్ గేమ్‌ను పరిశీలిస్తున్న ఆచార్య రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థుల్ని ఆలోచింపచేసేందుకు అవసరమైన ప్రోత్సాహం లభిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో–2023ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో వైజ్ఞానిక ప్రదర్శల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు ఇటువంటి ప్రదర్శనల్ని నిరంతరం ఏర్పాటు చేయాలని సూచించారు. న్యూయార్క్ తదితర ప్రాంతాల్లో ప్రతి ఏటా తప్పనిసరిగా ఒక ఉత్సవంలా సైన్స్ ఎగ్జిబిషన్లను నిర్వహిస్తారని తెలిపారు. నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ తాను హిందూ కళాశాల పూర్వవిద్యార్థినేనని చెప్పారు. 300 అంశాలతో నగరంలోని 100 పాఠశాలలు, కళాశాలల్ని సమన్వయ పరచి ఆసక్తికర అంశాలతో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర ఉన్న హిందూ కళాశాల అంతే స్థాయిలో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సభలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, హిందూ కాలేజ్–హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ మన్నవ మాధవి, ఆంగ్ల శాఖ అధ్యాపకురాలు చిలకా అరుణ, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గా ప్రసాద్ ప్రసంగించారు.

ఆకట్టుకున్న నవరత్నాల ప్రదర్శన

సైన్స్ ఎక్స్‌పోలో భాగంగా కళాశాల అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో డాక్టర్ పి. వేణుగోపాల్, షేక్ హసీనా రూపొందించిన నవరత్నాలు వీల్ గేమ్ సందర్శకులను ఆకట్టుకుంది. వీల్‌ను తిప్పితే అది ఏ పథకం వద్ద ఆగితే, ఆ పథకం గురించి వివరించి చెప్పిన వారికి ఒక బహుమతి ఇచ్చే విధంగా రూపొందించిన ప్రదర్శనను ఆచార్య రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు పరిశీలించారు.

నేడు, రేపు ప్రదర్శన

వివిధ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను తిలకించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మంగళ, బుధవారాల్లోనూ ప్రదర్శన కొనసాగుతుందని, ఉదయం 9.00గంటల నుంచి సాయంత్రం 5.00 గంటలలోపు ఉచితంగా తిలకించ వచ్చని నిర్వాహకులు తెలిపారు.

సహస్ర కలశాభిషేక మహోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని శ్రీ హంపీ విరూపాక్ష పీఠపాలిత శ్రీ గంగా మీనాక్షి సోమ సుందరేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సహస్ర కలశాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం వేదపండితులు గోపూజ, గణపతి పూజ, పంచగవ్య ప్రాసన, రుత్విగ్వరణం, సాయంత్రం అంకురార్పణ మండపారాధన, ధ్వజారోహణ తదితర పూజల్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కుందుర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ దేవాలయంలో ప్రతిష్ఠ జరిపి 120 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సహస్ర కలశాభిషేక మహోత్సవాన్ని ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3న హంపీ పీఠాధిపతులు శ్రీ విద్యారణ్య భారతీస్వామి స్వహస్తలతో 1008 దంపతుల ఆధ్వర్యంలో 1008 కలశాలతో గోపుర శిఖరాల్ని అభిషేకించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్య శర్మ, మధుశర్మ, ఆలయ ధర్మకర్త ఏక ప్రసాద్, ధూళిపాళ్ల భాస్కర్ శర్మ, మత్రిపాటి ప్రసాద్, సిరిపురపు శ్రీధర్ శర్మ, దారపునేని శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు మానసిక దృఢత్వం అవసరం



విద్యార్థినికి వ్యకిత్వ వికాస పుస్తకాన్ని అందజేస్తున్న స్టెప్ సీఈవో పల్లవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలని యువజన సర్వీసుల శాఖ, స్టెప్, స్వశక్తి సీఈవో ఎస్. పల్లవి సూచించారు. బ్రాడీపేటలోని బీహెచ్ బాలికోన్నత పాఠశాలలో స్టెప్ ఆధ్వర్యంలో వీఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 9,10 తరగతుల విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాస, కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్లవి మాట్లాడుతూ విద్యార్థినులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహం, దృఢత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. వీఆర్ విత్ యూఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎస్. అయ్యప్ప మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలతో పాటు టెన్త్ తరువాత కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు కె. శాంతిభూషణ్, ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ సుజాత, జరీనా, స్టెప్ మేనేజర్ బి. రాధిక, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్. శ్రీనివాసరావు, కేఎస్ఎస్సార్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మత్తులో బాత్‌రూంలోకి ప్రవేశించిన ఆగంతకుడు

గుంటూరు ఈస్ట్: శానిటైజర్ మత్తులో ఓ ఇంట్లోని బాత్‌రూంలోకి దూరి స్నానం చేసిన ఆగంతుకుడిని ఇంటి యజమానులు, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సేకరించిన సమాచారం మేరకు.. సంగడిగుంటలోని ఓ ఇంట్లోకి శానిటైజర్ తాగిన మత్తులో ఓ వ్యక్తి సోమవారం ప్రవేశించి బయట ఉన్న బాత్‌రూంలోకి వెళ్లి స్నానం చేశాడు. గమనించిన ఇంటి యజమాని, స్థానికులు అతడ్ని పట్టుకుని లాలాపేట పోలీసులకు అప్పగించారు. తారకరామ నగర్‌కు చెందిన ఆవుల ఆనంద్‌గా గుర్తించారు. కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

దంపతులపై దాడి

రోడ్డు దాటుతున్న దంపతులపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన అనూష, ఆమె భర్త సోమవారం స్వామి థియేటర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనాలపై వచ్చిన కొందరు వ్యక్తులు వారిని ఢీకొనబోయారు. ఈ నేపథ్యంలో అనూష, ఆమె భర్తకు, ఐదుగురి వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. దంపతులపై వారు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన మస్తాన్‌వలి గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 400 గ్రాములున్న 40 గంజాయి లిక్విడ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కొత్త పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట చెందిన నెల్లూరి కృష్ణ ప్రసాద్ (49) అనే వ్యక్తి ఈనెల 29న చికిత్స నిమిత్తం చేరి సోమ వారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831320కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహాత్ముడి బోధనలు.. నేటికీ మార్గదర్శకాలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిరి

నెహ్రూనగర్: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం హిమని సెంటర్‌లోని విగ్రహానికి తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా పోరాటాలు జరిపి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఖాజామొహిద్దీన్ చిష్టి, కొత్తపేట శివాలయం చైర్మన్ ఎం. సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు నూరిఫాతిమా, యిద్రిసాయి, కొండలు, పున్నారెడ్డి, హరి పాల్గొన్నారు.

- గాంధీ అహింస అనే ఆయుధంతో భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించారని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావుతో కలసి జిన్నా టవర్ సెంటర్ వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ వీసీ పి.రాజశేఖర్, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, పోలవరపు జ్యోతి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ గులాం రసూల్, ఆంజనేయులు పాల్గొన్నారు.
- కొరిటెపాడు సెంటరులో గల గాంధీ విగ్రహానికి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మా ట్లాడుతూ మహాత్ముడి ఆశయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమష్టిగా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ వంగల హేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు వలి వీరారెడ్డి, వాసవీ క్లబ్ సభ్యులు ఏ. నిరంజన్, ఏ. నాగేంద్ర, ఎం. రమేష్, పి. శ్రీనివాస్, గుడిపాటి భాస్కర్, నాగేశ్వరరావు, అప్పారావు, ఆంజనేయులు, రత్నప్రసాద్, కోటా శేషగిరి, రాజేష్ పాల్గొన్నారు

కేంద్ర బడ్జెట్లో గాంధీ ఆకాంక్షలు ప్రతిఫలించాలి

పాత గుంటూరు : రానున్న కేంద్ర బడ్జెట్లో జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య ఆకాంక్షలు ప్రతిఫలించాలని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య ప్రసాద్ పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక లాలాపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త పరిణామాల్లో భాగంగా దేశంలో వస్తున్న ఆర్థిక సంక్షోభం ముప్పుకు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్య విధానాలే పరిష్కార మార్గమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ షహెల నర్గీస్, కార్పొరేటర్ చిష్టి బాషా, పేరేచర్ల మస్తాన్ వలి, ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావు, మాదా రాధా, బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాల స్ఫూర్తితో ముందుకెళ్లాలి

గుంటూరు ఎడ్యుకేషన్ : మహాత్మా గాంధీ ఆశయాల స్ఫూర్తితో సమాజం ముందుకెళ్లాలని జెడ్పీ సీఈవో డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్ముడు అందరికీ ఆదర్శనీయుడని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్లు కె.చిన్నపరెడ్డి, ఎస్. నాగిరెడ్డి, ఉద్యోగులు ఎం. సీతారామయ్య, కె. శ్రీనివాసరావు, వై. బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

జిల్లా లెప్రసీ ఆఫీసర్ లక్ష్మానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మానాయక్

గుంటూరు మెడికల్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీనివాసరావుతోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'యాంటీ లెప్రసీ డే' వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ రోగులకు చేసిన సేవల గురించి వివరించారు. ఆయన సేవా దృక్పథాన్ని అలవర్చుకుని రోగుల్ని ఆదరించాలని చెప్పారు. కుష్ఠు వ్యాధిని సమాజం నుంచి తరిమి వేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది సకాలంలో రోగుల్ని గుర్తించి వెంటనే చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం, ఇతర సమస్యలు రాకుండా నిరోధించవచ్చని సూచించారు. వ్యాధి నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి జయప్రసాద్, హెచ్ఈఓ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎం.సోమ్లానాయక్, జె.మురళీకృష్ణ, సాంబశివరావు, పలువురు ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ నిపుణుడు నిక్ వుజిసిక్ రాక



గుంటూరు ఎడ్యుకేషన్: అమెరికాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు నిక్ వుజిసిక్ మంగళవారం గుంటూరు నగరానికి రానున్నారు. పుట్టుకతోనే అరుదైన వ్యాధికి గురై చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్ వుజిసిక్ తనలోని లోపాన్ని లోపంగా భావించక ఆత్మస్థైర్యంతో ఎదిగి, లక్షలాది మందిలో ధైర్యాన్ని నింపే స్థాయికి చేరుకున్నారు. గుంటూరుకు చెందిన ఎస్ఆర్ గ్రూప్స్ డైరెక్టర్ బొర్రా నరేష్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 9,10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, పీజీ చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు హాజరు కానున్నారు.

కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట రెండో లైనులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం కార్యదర్శి నంబూరి వెంకట నారాయణమూర్తి పర్యవేక్షణలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీ గంగా భువనేశ్వరి సమేత ఓంకారేశ్వరస్వామికి అభిషేకార్చనలు, సీతా సమేత కోదండ రామస్వామికి తులసి అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు బుజ్జి బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహా హారతి , మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఇందుమతి బృందం భక్తి సంగీతం ఆకట్టుకుంది. శ్రీ మద్రామాయణ ప్రవచనంలో భాగంగా శ్రీ ఆంజనేయస్వామికి శ్రీ రాముని దర్శనం, సుగ్రీవునితో మైత్రి, వాలిని సంహరించడం, సీతాన్వేషణ, కిష్కింధలోని అనేక సన్నివేశాల్ని మంచికంటి వెంకట సత్యవతి వివరించారు.